ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత

మంచిర్యాల ఏసీసీ : విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బా రాయుడు

- డీఎంహెచ్‌వో సుబ్బా రాయుడు
- నర్సింగ్ కళాశాలలలో అవగాహన సదస్సు

మంచిర్యాల ఏసీసీ, డిసెంబర్ 1: ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత అని మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి జీ సుబ్బారాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ మంచిర్యాల ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ డేపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ హెచ్ ఐవీ పరీక్షలు చేసుకొని మీ ప్రస్తుత స్థితిని తెలుసుకొని ఎయిడ్స్ రోగ వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. జిల్లా దవాఖానతో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వరల్డ్ ఎయిడ్స్ సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ నీరజ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్ వైజర్ వీ.అనిల్ కుమార్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమా, కళాశాల లెక్చరర్లు, వైద్య సిబ్బంది అల్లాడి శ్రీనివాస్, నామ్ దేవ్, రామ్మూర్తి, డెమో వెంకటేశ్వర్లు, విద్యార్థులు, ప్రభుత్వ దవాఖాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కోటపల్లిలో ర్యాలీ తీస్తున్న వైద్యులు, సిబ్బంది

మంచిర్యాల లో కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సభ్యులు

ఎయిడ్స్ నివారణపై కొవ్వత్తులతో ర్యాలీ

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన ఎదుట జిల్లా ఎయిడ్స్ ప్రివెంటేషన్ అండ్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు ఎయిడ్స్ నివారణపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం జిల్లా సూపర్‌వైజర్ వీ అనిల్ కుమార్, డెమో వెంకటేశ్వర్లు, ఎన్‌జీవో స్నేహ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, డిసెంబర్ 1 : కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్ డే నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలపై వైద్యాధికారి సత్యనారాయణ వివరించారు. ఎయిడ్స్ వ్యాధి, నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఏఎన్‌ఎం విజయ, ఆయూష్ ఫార్మసిస్ట్ బడికెల శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు భారతి, మల్లీశ్వరి, సిబ్బంది ఖలీల్ ఖాద్రీ, గడ్డయ్య, ఫరీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఇచ్చోడ, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలో ఇచ్చోడ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. క్విజ్ పోటీల్లో జీ కిరణ్ పదో తరగతి, ఎ సాయికుమార్ పదో తరగతి, పోస్టర్ పెయింటింగ్ కే సిద్ధార్థ బైపీసీ మొదటి సంవత్సరం(ప్రథమ), డ్రాయింగ్ పోటీలో ఆర్ సాయికుమార్ (ప్రథమ) బహుమతి డీఎంహెచ్‌వో చేతుల మీదుగా అందుకున్నారు. విజేతలను ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ హరిరాం, నర్మదా, ఎయిడ్స్ ఇన్‌చార్జి (రిమ్స్) సరిత అభినందించారు.

కనుల పండువగా రథయాత్ర

కోటపల్లి, డిసెంబర్ 1 : కోటపల్లి మండలంలోని జనగామ గ్రామంలో మదన పోచమ్మ అమ్మవార్ల జాతరను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరాగా అమ్మవారి రథయాత్రలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కోటపల్లి మండలంతో పాటు చుట్టు పక్కల మండలాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.


జనగామ గ్రామంలో రథయాత్రలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కార్తీక బహుళ చవితి

ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

- గూడెంలో భక్తుల రద్దీ
- గోదావరిలో కార్తీక దీపాలు వదిలి పూజలు
- సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

దండేపల్లి, డిసెంబర్1: దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక బహుళ చవితి పర్వదినం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొన్నది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు గోదావరి నదిలో కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింద భాగంలో రావి చెట్టు కింద, గుట్ట పైన గల ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 313 మంది సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ ప్రాంగణంలో రావి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలంపియాడ్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్ రెడ్డి తదితరులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 1 : కరీంనగర్ జిల్లా వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే అల్ఫోర్స్ మాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్ - 2024 గోడ ప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గణిత శాస్త్రం చాలా ప్రాముఖ్యమైనదని, వివిధ పోటీ పరీక్షలకు ఉపకరిస్తుందని తద్వారా విజయం సాధించడం చాలా సులువుగా ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన (ఆదివారం) ఉదయం 10 గంటలకు తెలంగాణలోని వివిధ అల్ఫోర్స్ పాఠశాలల్లో, కళాశాలల్లో పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలో మొదటి 3 స్థానాలలో గెలిచిన విద్యార్థులకు 22వ తేదీన శ్రీనివాసన్ రామానుజన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహింపబడే జాతీయ గణిత దినోత్సవ వేడుకలలో అతిథుల చేతుల మీదుగా బహుమతులు, నగదు పారితోషికాలను ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 91602 94441, 93982 30614, 92469 34441 లో సంప్రదించవచ్చన్నారు.

పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి

- అధికారులు, సిబ్బందికి రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశం

రిటర్న్ రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

బెల్లంపల్లి, డిసెంబర్ 1:ఈవీఎంల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశించారు. బెల్లంపల్లిలోని తిలక్‌స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల రిటర్న్ రిసెప్షన్ కౌంటర్‌ను గురువారం రాత్రి ఆమె పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన అన్ని ఈవీఎంలకు పట్టి భద్రత నడుమ భద్రపరచాలని సూచించారు. ఈవీఎంల లెక్కింపు వరకు పోలీస్ సిబ్బందితో రాత్రి పగలు బందోబస్తు నిర్వహించాలని వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు ఆమె పలు సలహాలు, సూచనలు చేశారు. ఆమె వెంట ఏసీపీ పంతాటి సదయ్య, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.